స్కెచ్

# చీమలు పెట్టిన పుట్టలు

వల్లపురెడ్డి

"గరం గరం, తాజాతాజా చనే బటానీ...."

ప్లాటుఫారంమీద అడుగు పెట్టానే ఈ కేక శ్రవోరంధ్రాల్లో దూరింది. అమ్మేవాడి గొంతుకలోంచి వెలువడిన ధ్వనిలో ఆ 'చనే బటానీ' అనే మాటలు లేకపోయినట్టయితే నిజంగా ఆ కేక మాకు కనీసం ఒక గంట సేపైనా బధిరత్వం ప్రసాదించి ఉండేది. పైపెచ్చు ఆ 'చనే బటానీ' ఉత్తుత్తవి కావు!— 'గరం గరం, తాజా తాజా!' చనే బటానీల్లో ఉన్న ఈ విశేషమే అంతటి కర్కశమై వాడి కేకని కూడా మా చెవులకి తీయని సంగీతంలా మార్చింది.

రెండు మూడడుగు లింకా ముందుకు వేయడంతోటే, అవే కేకలు వెనుకనించీ, ముందునించీ, ప్రక్కలనించీ, ఐమూలలనించీ ప్లాటుఫారాన్ని మారు మ్రోగిస్తూ వచ్చి మమ్మల్ని చుట్టుకున్నై. ఇంట్లో పిల్లలుగాని అంతటి అల్లరి చేసి ఉంటే వాళ్ళ వీపులు తాపామరపాలై పోయి ఉండేవి. కాని ఈ దశదిశాగతరావాలు మాత్రం సమస్త వాద్య సమ్మేళనంలా సాగింది మా మనశ్రవోపథాల మీదినించి. నా వెంట ఉన్న మిత్రుడు గోవిందు సంగతి సరిగ్గా చెప్ప లేను; కాని నేను మాత్రం పూర్తిగా ఆ కేకల వైపు ఆకర్షింప బడ్డాను. ప్లాటుపారం మీదకు రాకముందు నాతో ఒక ముఖ్య విషయ ప్రసంగంలో ఉన్న గోవిందు నోరు ఉన్నట్టుండి మూగపడి పోయినందున అతను కూడా నిస్సందేహంగా నా స్థితిలోనే పడిపోయాడని చెబితే అదేమీ సత్యదూరం కాదు. నా కళ్లస్తమానమూ చనే బటానీ లమ్మే వాళ్ళ చేతుల్లోని బుట్టల వైపే చూస్తున్నాయి.

ఆధునిక యుగంలో చిఱుతిండి కొని నడిరోడ్డుమీద తింటూ విలాసంగా నడచి పోవడమనేది నాగరికతలో చేరిపోయింది. ఆ నాగరికతని మేం చూశాం. కాని దానికీ, మేం పెరిగిన వాతావరణానికీ అయస్కాంత సజాతి ధ్రువాలకున్నంత మైత్రి. ఐనా, అప్పుడప్పుడు వాంఛలు అనుల్లంఘనీయము లయినప్పుడు, ఆ నాగరికతని స్వీకరించాం అమృతోపాయనంగా. అంచేత మేం కేవలం ఆధునిక నాగరికతా స్పర్శ చేత స్వీయ నాగరికత కలుషిత మౌతుందనే భయంవల్లనే చనే బాటానీల వైపు ఉరకలు వెడుతున్న హృదయద్విరదాలకు అంకుశాలను ఉపయోగించామనేది పుష్టిగల వాదం కాదు.

అయితే, ఇంతకంటే బలవత్తరమైన కారణం ఏదో ఒకటి ఉండి తీరాలి. ఇది తార్కికం.

ప్రపంచంలోని అధిక సంఖ్యాకులకు మల్లేనే మేం నాటిన మొక్కల ఫలాన్ని మేం చాలా అరుదుగా తిన్నాం. అందరూ తమ జీవిత ప్రస్థానం సమాప్తం కావడం మూలాన్ని తిన్లేక పోయారేమో కాని మేం మట్టుకు బ్రతికి ఉండీ తినలేని వాళ్ళలో జమ. ఇంట్లో ఒక్కనాడు షడ్రసోపేతమైన భోజనం చేద్దామంటే మన స్సొప్పుకోదు—డబ్బు ఖర్చవుతుందని. ఎవడైనా పరిచయస్థుడు చేబదులని పదిరూకలు పట్టుకెళ్ళి ఎగనామం దిద్దితే, "పోనీ, వాడు మాత్ర మేం వృద్ధికొస్తాడు?" అని తృప్తిపడతాం. ఇంట్లో తాయిలం కొనడానికని మారాం చేసే పిల్లలకి ఒక కానీ ఇవ్వలేం; కాని బజారులో చేయి చాచి అడిగిన బికారికి ఏమీ ఇవ్వలేక పోతే మథన పడతాం. ఇలాంటి అలవాటు మాలో ఎలా ప్రవేశించిందో చెప్పలేం. కాని ఇప్పుడు మాత్రం ప్రకృతి సిద్ధంగా వచ్చిన దానికిమల్లే నాటుకుపోయింది.

ఇన్నిటికీ తోడు మా గోవిందు 'The man in black' లాంటివాడు. ప్రపంచమంతా దగా కోరులూ, అవినీతిపరులూ నిండిపోయారనీ, కష్టించలేక యాచకవృత్తి ప్రధానంగా జీవించడం అందరికీ సులభతరమైన మార్గంగా గోచరించిందనీ, అలాంటివాళ్లను చూసి జాలి పడి దానధర్మాలు చెయ్యడం కేవలం కలవాళ్ల మూర్ఖత్వమేననీ, తద్వారా సోమరిపోతులను పెంచడంకంటే దేశానికి వలసినమేలేమీ జరుగదనీ ఆయన నాతోనూ, అప్పుడప్పుడు తారసిల్లే ఇతర మిత్రులతోనూ ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోతుంటాడు. ఎవరైనా ఆ మాటలు వింటే అతణ్ణి కనికరంలేని జడుడని భావిస్తారే కాని పతితుల్ని ఉద్ధరించడంలో తన శక్తిని దాచుకోకండా పాటుపడేవాడని అనుకోరు. తన హృదయంలోని ఆర్ద్రత్వం అందరిఎదుటా కప్పిపుచ్చగలిగాడు-నీడలా అతణ్ణంటి ఉండే నా దగ్గర వినా.

గోవిందులో ఇన్ని సద్గుణాలున్నా సామాన్యమైన మానవుడే—నాలాగు.

రైలు రావడానికి ఇంకో అరగంట ఉంది దాదాపు. మెల్లిగావెళ్ళి ప్లాటుఫారంమీది బెంచీమీద కూర్చున్నాం ఇద్దరమూ. బటానీలమ్మే వాళ్లవైపు ఒకరికి తెలియకండా ఒకరంచూశాం. ఇద్దరమూ ఒకసారి పరస్పరావలోకనం గావించుకొన్నాం. ఏదో తెలిని అభిమానంతో ఇరువురి శీర్షాలూ వంగినై. అలాగే ఒక ఐదు నిమిషాలు మౌనంగా గడిచినై.

''బటానీలు తింటావా?''-అన్నాడు ఇద్దరి మధ్యా జారిన మౌనయవనికను చీలుస్తూ.

నిజానికది అతనిలోని గాఢ వాంఛ. నా నుంచి ఆశించిన అనుకూల సమాధానాన్ని వినియోగించుకుని ఆ వాంఛని తీర్చుకుందామని ఉబలాటపడుతున్న సూచనల్ని గ్రహించాను అతని ముఖంలో.

అయితే, నేనూ మానవుణ్ణే! అతనడగటంతోనే నేనుమాత్రం ఎలా ఒప్పుకుంటాను? ''ఆ, ఎందుకులే?''—అన్నాను ముభావంగా.

అంతే. అతను మళ్లీ మాట్లాడలేదు.

వస్తుతః బటానీలు కొనడం ఏమంత పెద్ద సమస్యకాదు. తిన దలచుకుంటే ఒక్క అణా వ్యయంకన్నా మించిందికాదు. ఐతే ఎందుకు తినలేకపోయాం? మనసులోని కోర్కెను మనసులోనే ఎందుకు అణచివేసుకున్నాం? దీనికి తగినంత కారణముంది. చేతిలో ఉన్న ప్రతి కానీ ఒక మహత్తరమైన ప్రయోజనాన్ని సాధించడంకొరకు వినియోగించబడాలి. ఇది మా గోవిందు ఆశయం. బటానీలు తినకపోతే బ్రతగ్గలం. అలాంటప్పుడు వాటిని తినకపోతే వచ్చిన నష్టమేమిటి? డబ్బు మిగిలిపోతుంది; ఇది కొంత లాభమే. జరిగే హానిఅంతా ఏమిటంటే మనస్సులో రేగిన వాంఛని అణచుకోడానికి బాధపడడం. బాధపడ్డం మంచిదే. భవిష్యత్తులో బృహదాశయం సాధించదలచుకొన్నవారు ఆత్మసౌఖ్యం కొరకు ప్రాకులాడగూడదు. ఆత్మ సౌఖ్యాన్ని దృష్టిలో ఉంచుకొన్నవాడు స్వార్థపరుడుగా మారిపోవడానికి ఎంతైనా వీలుంది....ఇదీ ఆయన నాలాంటి వాళ్ళకు అప్పుడప్పుడూ అందించే బోధామృతం.

మనోవాంఛని తీర్చుకోవడానికి మార్గమున్నా దాన్ని అణచి పెట్టుకోవడం ఆత్మహత్యాసదృశమైన అఘం అని నాలో నేను అనుకుంటాను. స్వీయ సౌఖ్యంకొఅకు అఱ్ఱులు చాచడం మంచిది కాకపోవచ్చు: కాని అందుబాటులో ఉన్నదాన్ని జారవిడుచుకోవడంలో అర్థం ఏముంది? బాధ అనేది మనిషిలోని మానవతని సాన పడుతుంది—నిజమే. వ్యక్తి అనుభవజ్ఞుడవుతాడు అందుమూలంగా. కాని ప్రయత్నపూర్వకంగా తెచ్చిపెట్టుకున్న బాధలు ఎంత అనుభవాన్ని ప్రసాదిస్తాయో, మనిషికి ఎంత మెఱుగుదిద్దుతాయో తెలీదు. ఇవన్నీ నా అభిప్రాయాలు. నేనాయన ఎదుట ఈ వాదనలనుపయోగించను. వాదించి నెగ్గాలేను. అంచేతె ఆయన బోధామృతం గరళంగా తోచినా కళ్ళు మూసుకుని గొంతులోకి జార్చుకుంటాను.

కూర్చున్నా, నడుస్తున్నా ఏదోఒక విషయాన్ని గురించి మాట్లాడుకుంటూవుండే మాకు ఈ చనే బటానీల సమస్య వచ్చేసి మౌన

మంత్రం ప్రయోగించింది. గత్యంతరం లేక అతను దినపత్రిక విప్పి తద్గత సమాచారాలను శూన్యంగా చూస్తున్నాడు. నేనూ అతని చేతిలో ఉన్న మరో పత్రికనితీసి పేజీలు తిరగవేస్తున్నాను. పత్రికలోని విషయాలు అతనికెంత అర్థమవుతున్నాయో నాకూ అంతే అర్థమవుతున్నాయి. మధ్యమధ్య ఒకరికి తెలియకుండా మరొకరం నిశ్శబ్దంగా చిన్నచిన్న నిట్టూర్పులు నిగుడించుకుంటున్నాం లోలోపల.

మరొకొన్ని నిమిషాలు గడచినై. ప్లాటుఫారంమీద ఉన్న ఇతర జనాన్ని కానీ లడుక్కుంటూ మా దగ్గిర కొచ్చాడొక బిచ్చగాడు. వాడి మలీమస దేహమూ, కంపుగొట్టే జీర్ణాంబరాలూ చూస్తే రోత జనిస్తుంది. మనిషి మాత్రం ధృఢంగా ఉన్నాడు. కలియబడితే మా ఇద్దరినీ ఒక్కచేత్తో తిప్పి కొట్టేయగలడు. వాడికున్న కండరాల బలాన్ని ఉపయోగించుకుంటే యాచించే గతి పట్టక పోను. నాకేర్పడిన అభిప్రాయం ప్రకారం వికలాంగులు బిక్షకవృత్తి నవలంబిస్తే తప్పలేదు; కాని సర్వావయవాలూ సరైన స్థితిలో ఉండి బిచ్చమెత్తుకుంటే దానం చేసేవాడికీ, పుచ్చుకునే వాడికీ జ్ఞానం లేదన్నమాటే.

వాడు చేయి ముందుకు సాచడమే తడవుగా ఒక అర్ధణా బిళ్ళతీసి పడేశాడు గోవిందు.

మౌన ముద్రాంకితుణ్ణయిన నన్ను సంబోధిస్తూ "బాబూ!" అన్నాడు వాడు దీన స్వరంతో. ముఖాన్నికూడా తగినంతగా దైన్యాచ్ఛాదనం కావించాడు.

లేవు అన్నట్లు తల అడ్డంగా ఊపుతూ, వెళ్ళమన్నట్లు చేత్తో సంజ్ఞ చేశాను.

వాడు వెళ్ళలేదు. "బాబూ! ధర్మం!"—అన్నాడు మళ్ళీ.

ఈసారి నోరు కదపక తప్పలేదు నాకు. "వెళ్ళమని చెబుతూంటే తెలియడం లేదూ?" అన్నాను రూక్షస్వరంతో. ఆ సమయానికి నాదగ్గర చిల్లరడబ్బులు లేవు. లేకపోతే, ఇష్టం లేకపోయినా, ప్రక్కన ఉన్న మిత్రుడు దానం చేశాడు గాబట్టి, నేనూ చేసేవాణ్ణే ఆత్మగౌరవం నిలబెట్టుకోవడానికి.

వాడు మొండికేసుకు నిల్చున్నాడు. "పుణ్యముంటుంది; ఒక్కకానీ ధర్మం చెయ్యండి బాబూ! మీపేరు చెప్పుకుంటాను."

నాకు కోపమూ, విసుగూ ముంచుకొచ్చినై. ఈసారి మా గోవిందే కలగజేసుకున్నాడు. "ఏయ్, ఇచ్చింది చాలదా? వెళ్ళు"—అన్నాడు.

"ఈ బాబుచేతగూడా ఒకర్థణా ఇప్పించండి బాబూ! మిమ్మల్ని తల్చుకుంటూ తింటాను." అని మొరెట్టుకో సాగాడు వాడు, వాడి మొరవిని నా పక్షానకూడా తనే ధర్మం చేస్తాడేమో ననుకున్నాను.

కాని అలాగ జరుగలేదు గోవిందుక్కూడా కోపం వచ్చినట్లుంది! "వెళ్ళు. ఏమైంది నీకు? దున్నపోతులా ఉన్నావు. పనిపాటు చేసుకోగూడదూ? వెళ్లువెళ్లు." అని కసిరాడు.

"అట్లా అంటారేం బాబూ! మీరిచ్చారు కదా...."

వాడి అర్థన పూర్తి కాకముందే అందుకున్నాడు గోవిందు: "అవును, నే నిచ్చి తప్పు చేశాను. అసలు నీలాంటి వాళ్ళకి దానం చెయ్యకూడదు. గ్రుడ్డివాడివా, కుంటివాడివా? నీ కెందుకు ధర్మం?" అని.

"గుడ్డోళ్ళకూ, కుంటోళ్ళకూ దానం చెయ్యటం ఏం లాభం బాబూ? వాళ్లు పాపిష్టులు! మొదటి జల్మలో పాపాలు చేసుంటారు, కనుకనే ఈ జల్మంలో అలాగై ఉంటారు వాళ్ళు."

వికలాంగులని గురించి వాడి వ్యాఖ్యానం వినేసరికి నాకు నడి నెత్తిలో వెంట్రుక సుడి తిరిగింది. "తమరేం సుకృతం చేశారు స్వామీ, ఈ జన్మంలో ఇలా ముష్టెత్తుకునే యోగం సిద్ధించింది?"-అన్నాను ముఖాన్ని వికృతంగా మార్చి.

ఇక వాడక్కడ నిల్చోలేకపోయాడు.... "మా గొప్పగా దానంచేసేవాళ్ళలాగే వున్నారు. మీలాంటోళ్ళు...." అని ఏమేమో గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"అడుక్కు తినే ముష్టి ముండాకొడుక్కి ఎంత గర్వం! హుఁ!"-ఇది తనలో తాను అనుకోవాల్సిన మాట. కాని వాడిమీద కలిగిన

(తరువాయి 33 వ పేజీలో)